కాంప్లెక్స్

ఇచ్ఛాపురపు రామచంద్రం

గడియారంవేపు చూస్తూ కూర్చున్నాను.

నా ఓటమి కింక పావుగంట వ్యవధి మాత్రమే ఉంది. ఔను. నేనూ మనిషినే. నా సహనానికీ హద్దులున్నాయి. సైకియాట్రీ చదివిన నేరానికి యీ మూడు నెలలనుంచీ నే ననుభవిస్తున్న శిక్ష తక్కువేమీ కాదు. సాయంత్రం నాలుగయ్యేసరికి రూము తలుపు తెరవడమూ- ఒంటరిగా గదిలో కూర్చుని- ఎవరైనా వస్తారేమో అని ఆశగా ఎదురుచూడడమూ- ఏడుగంటలయ్యాక నీరసంగా తలుపులు మూసుకుని వెళ్లడమూ. బోర్డు కట్టాక- నేనొక చేదునిజం తెలుసుకున్నాను, ఈ మనుషులకి సూదిమందుల డాక్టర్లతోనే తప్ప సైకియాట్రిస్టులతో బొత్తిగా అవసరం ఉండదని. జనరల్ మెడిసినో, సర్జరీయో చదివితే నా అదృష్టం మరోలా ఉండేది. బోర్డు కట్టి మూడునెలలయినా ఒక్కరూ రాలేదంటే- యిక చెప్పడానికేముంది? పేషెంట్లు లేకపోవడంకంటె డాక్టరుకి అవమానం ఏముంటుంది?

ఈ చివరిరోజు... మరో పావుగంట...

అంతే. సైకియాట్రిస్టుగా ఓడిపోయి మరో అవతారం ఎత్తే ప్రయత్నాలు ప్రారంభిస్తాను.

"బాబూ-"

ఆశగా చూశాను అటువేపు.

ప్చ్. సూదిమందు కేసే. మనిషిని చూస్తేనే తెలిసిపోతూంది, నాకోసం వచ్చి ఉండదని. అతను- ఒక ఉత్తరం అందించాడు. కవరుమీద అడ్రసు నాదే. మూర్తి- సైకియాట్రిస్ట్. ఆశగా ఆత్రతగా చదివాను

"డాక్టర్!... దయచేసి వీడితో రండి. మీతో ముఖ్యమైన పనుంది-" అంతే ఉత్తరం.

ఉత్సాహంగా బయలుదేరాను రూము లాక్ చేసి. రోడ్డుమీద- నాకోసం కారు!

పది నిముషాలలోగానే నేనొక బ్రహ్మాండమయిన భవనం చేరుకున్నాను.

వివరంగా తెలియదు కానీ అది జమీం దారులదని విన్నాను.

నౌకరు నన్నొక గదిలోకి తీసుకు వెళ్లాడు. ఒక గోడమీద షరీఖుచిత్రం.. మరోదానిమీద లేడికొమ్ములు.. ఒకపక్క పాతకాలపు చిత్రాలు... పైకప్పుకు వేలాడుతున్న చాండ్లియర్.. ఆ గది విలక్షణంగానే ఉంది. సోఫాలో- భారీ విగ్రహం.. నన్ను చూసి కొంచెం కదిలింది.

"నా పేరు రాజా బహదూర్ రంగా రావు."

"నమస్కారం. నేను- మూర్తి.... సైకియాట్రిస్ట్."

"కూర్చోండి.. మీతో ఒక విషయం మాట్లాడాలి."

నౌకరు- ట్రేతో టీలు తీసుకువచ్చాడు.

"మా ఏకైక పుత్రిక యశోధర. చాలా చక్కనిది. కొంచెంసేపట్లో చూద్దురుగాని. ఆమె వయసు ఇరవై. ఆమెకు పెళ్లి చేయాలని మా సంకల్పం.."

"మంచిది.."

"ఈ ఫోటోలు చూడండి." దగ్గరగా ఉన్న టేబులుమీది అల్బమ్ అందుకుని చూపారు. ఆ రేడు గురు యువకుల ఫోటోలున్నాయి అల్బమ్‌లో. రూప వయోలావణ్యాలలోనే కాకుండా మిగిలిన కోణాలనుంచి కూడా వాళ్లందరూ జమీందారుకి అల్లుడు కాగలిగే యోగ్యత ఉన్నట్లే అనిపించారు.

"అందరూ- ఎవరికి వారే చాలా యోగ్యులు. వచ్చి యశూని చూశారు. అందరికీ మా యశూ నచ్చింది. కాని- దురదృష్టమేమిటంటే- యశూ కెవరూ నచ్చలేదు" భారంగా మారిపోయిం దాయన గొంతు.

"ఎందుకని?"

"అదే మీరు తెలుసుకోవలసింది."

విసాళ కలిగింది నాలో. నేను చేయ వలసింది సైకియాట్రీ కాదు, పెళ్లి రాయ బారం!

నా వృత్తి అది ఎంతమాత్రమూ కాదు.

లేవబోయాను.

"దయచేసి కూర్చోండి. యశూ మనసు సరిగా లేదేమో అని నా అను మానం-"

ఈ సారి నాలో ఉత్సాహం వచ్చింది.

"ఆమె మనసు మీరు సరిచెయ్యాలి. కాను, జరిగిన సంఘటన- చిన్నదేమీ కాదు" నిట్టూర్చారాయన

"ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాను.

"మూడునెలలౌతుంది.. అమ్మాయీ నేమా ఆగ్రా వెళ్తున్నాం, ఫస్ట్‌క్లాస్‌లో. యశూకి ఏసీ యిష్టముండదు. మా ఎదుట సీటు ఖాళీగా ఉంది. తరువాత ఎక్కడో అది నిండుతుందని చెప్పాడు అటెండెంట్.

నేను నిద్రపోయాను త్వరగానే. యశూ ట్రాన్సిస్టర్ పెట్టుకుంది. ఆమెను



కూడా త్వరగా పడుకోమని నేను నిద్ర లోకి జారిపోయాను. ఎంతసేపు నిద్ర పోయానో తెలియదు.

కెవ్వున కేక. త్రుళ్లిపడి లేచాను. కంటపడిన దృశ్యం... కోపం తెప్పించింది.

అమ్మాయీ, అతనూ ఎదురెదురుగా నిలబడి ఉన్నారు.

యశూ కళ్లు అగ్నికణాలు కురిపిస్తున్నాయ్. అతను— వాడు— దోషిలా తల వంచుకుని నిలబడ్డాడు.

"ఏమైంది యశూ?"

"ఈ బ్రూట్ నన్ను బుగ్గమీద...."

"రాస్కెల్!" అంటూ వాడిమీదకు లంఘించాను. ఎన్ని దెబ్బలు కొట్టానో పిచ్చికోపంలో నాకే తెలియదు. వాడు ఎదురుతిరగలేదు. నా దగ్గర ఆ క్షణంలో తుపాకీ ఉంటే వాడినక్కడే షూట్ చేసేవాణ్ని. అంత కోపం వచ్చింది. ఒక జమిందారుగారమ్మాయిమీద అత్యాచారం తలపెడతాడా! ఎన్ని గుండెలు.

కోర్టుకీడ్చి వాడికి బుద్ధొచ్చేలా జైల్లో పెట్టించాలని అడ్రస్ సంపాదించాను. ప్రయాణం మధ్యలోనే వెనక్కి వచ్చే

కాము. లాయర్‌తో సం|ప్రదించగా- జరిగిన విషయం వంశగౌరవాన్ని పెంచేదికాదనీ దానిని రచ్చకీడ్చితే మన పరువే బజారుపాలౌతుందని చెప్పాడు. అదీ నిజమే అనిపించి ఆ |ప్రయత్నం మానుకున్నాను. యశూకి పెళ్లిసంబంధాలు చూడసాగాను. వరులను రప్పించి యశూకి చూపాను. కాని- ఒక్కరూ ఆమెకు నచ్చలేదు! నా ఉద్దేశం- యశూ మనసు సరిగా లేకనే ఎవరూ నచ్చడం లేదేమో అని."

"కావచ్చు." అన్నాను సీరియస్‌గా ఆలోచిస్తూ.

"వెళ్లి- యశూని చూసి- మాట్లాడి రండి."

నౌకరు నన్ను మేడమీద గదిలోకి తీసుకువెళ్లాడు.

"రండి... నమస్కారం-" అద్భుతమయిన అందం ఆమెది. కళ్లు చెదిరాయొక్కసారి.

"నమస్కారం.....నే ను-" ఏం చెప్పాలా అని సందేహించాను

ఆమె నవ్వుతూ- "నాకు తెలుసు. మీ రెందుకు వచ్చారో, మీరెవరో అన్నీ తెలుసు." అంది.

"థాంక్స్. నాకు చాలా |శమ తగ్గించారు. యశోధరా!.... మనం కొంచెం మాట్లాడుకుందాం...."

"అలాగే చెప్పండి. ఉండండి.." అంటూ నౌకరుని టీ తెమ్మని పురమాయించింది.

"రోజులు మారిపోతున్నాయి. |ప్రపంచం మారిపోయింది. మనుషులలో మానవత్వం |క్రమంగా నశించిపోతూంది. మానభంగాలు, హత్యలు, దోపిడీలు.. సజీవ దహనాలు.. పేపరు తిప్పితే దాని నిండా యివే. ఏమంటారు?"

"ఊఁ."

"ఏ విషయాన్నయినా సీరియస్‌గా తీసుకుంటే- |బతకడం కష్టం. మారే |ప్రపంచంతో మనమూ మారాలి. పరిస్థితులకి, వాతావరణానికి సర్దుకోడం నేర్చుకోవాలి. లేకపోతే క్లిష్టమౌతున్న యీ |ప్రపంచంలో |బతకడం బహు కష్టం. ఏమంటారు?"

"నిజమే."

"చూడండి.. మీ నాన్నగారికి మీరంటే చాలా |ప్రేమ-"

"|ప్రాణమే."

"ఆయన మీకు చాలా చక్కని సంబంధాలు తెచ్చారు. వీళ్లలో చక్కని పర్సనాలిటీ కల యువకులున్నారు. మీకు తగినవారు కాదనుకోను. అవి- చాలా మంచి సంబంధాలు."

"ఔను."

"కాని, మీకు వారిలో ఒక్కరూ నచ్చలేదు!"

"అది కాదు. వాళ్లలో ఒక్కరికీ నేను నచ్చినట్లులేను."



"అదేమిటీ! మీ నాన్నగారు మరోలా చెప్పారే!" ఆశ్చర్యంగా చూశాను.

"ఎవరు చెప్పింది నిజమో మీరే తేల్చుకుందురుగాని. ఆ వేళ- రైలు పెట్టెలో జరిగినది మీకు వివరంగా తెలుసా?"

"నాన్నగారు చెప్పారు—"

"ఆయన చూడని- అసలు విషయం నేను చెబుతాను. వింటారా?"

"తప్పకుండా. చెప్పండి." కుతూహలంగా చూశాను

"మొదట- నా ప్రశ్నకు జవాబు చెప్పండి. నేను అందమైన అమ్మాయి నేనా?"

"మీది- మామూలు అందం కాదు. చాలా అరుదైన... అద్భుతమయిన సౌందర్యం."

"పెళ్లిచూపులకు వచ్చిన యువకులలో ఒక్కరూ యీ మాత్రపు మాటయినా అనలేకపోయారు, ఏకాంతంలో కూడా."

"అందానికి మీటర్ లేదు, ఎదుటివారి హృదయం తప్ప. భావం అంతటినీ ప్రకటించేందుకు భాష చాలదు చాలా సమయాల్లో. పెళ్లికొడుకుల విషయంలో అదే జరిగుంటుంది."

"భావప్రకటనకు భాషకు మించిన సాధనముంది. ఎమోషన్... యాక్షన్..."

నిరుత్తరుడినయ్యాను. ఈ అమ్మాయి అందమైనదే కాని అమాయకురాలు కాదు.

"నా ఉద్దేశంలో- నేను- జగదేక సుందరి క్లియోపాత్రా కోవలోకి చేరే సౌందర్యవతిని."

"నిస్సందేహంగా." అన్నాను. అందుకు నేనేమీ ఆత్మవంచన చేసుకోవలసిన అవసరం లేకపోయింది. నిజంగా ఆమె చాలా అందమైనది.

"రైలుపెట్టెలో-

నైట్ డ్రెస్‌లో నిద్రపోతున్నాను. హటాత్తుగా మెలకువ వచ్చింది ఎవరిదో

స్పర్శతో, లేచి- కోపంగా చూశాను.

"క్షమించండి. మీరు ఆకుపచ్చ సిల్కు-లో వనసుందరిలానే కనిపించారు. మీ వదనం వికసించడానికి సిద్ధమౌతున్న గులాబి మొగ్గలాగే కనిపించింది నీలి దీపపు కాంతిలో- మీ నిరుపమాన సౌందర్యం నన్ను విభ్రాంతుణ్ని ఉన్మత్తుణ్ని చేసింది. అందుకే మీ ముఖాన్ని చేతులలోకి తీసుకుని, మీ బుగ్గలమీద ముద్దుపెట్టుకోకుండా ఉండలేకపోయాను-"

నేను ఆ క్షణంలో మూర్ఖుగాలినీ, ముందుచూపు లేనివాడినీ కాకపోతే అనవసరంగా గోలచేసి నాన్నగారిని లేపి ఉండేదాన్ని కాను."

తెల్లబోయాను. యశోధర మాటల తర్థమేమిటి?

"అతని పేరు చక్రవర్తి. నేనెంత పొరపాటుచేశానో తరువాత తెలిసి వచ్చింది. ఎందరో యువకులు నన్ను చూశారు కానీ ఎవరూ చక్రవర్తిలా నా సౌందర్యానికి తగిన అభినందనలందచేయలేకపోయారు. వీళ్ల కనులు సౌందర్యానికి స్పందించే హృదయమే లేదేమో అని నా అనుమానం-"

మెల్లగా యశోధర అర్థమౌతూంది. ఆమె చిత్రమయిన అంతర్యం తేటతెల్లమౌతూంది.

"నా సౌందర్యాన్ని నిజంగామా చక్కగానూ చూడగలిగిన యువకుడు చక్రవర్తే. అతన్ని మరచిపోవడం నా తరం కాదు. ఇంతమంది 'పెళ్లికొడుకులలోనూ ఒక్కరూ చక్రవర్తికి దగ్గరగా ఐనా రాలేకపోయారు దురదృష్టవశాత్తూ."

పూర్తిగా అర్థమైపోయింది.

యశోధర అందానికి సరయిన అభివందన నందించగలిగినవాడూ, ఆమె అహాన్ని తృప్తిపరచగలిగేవాడూ చక్రవర్తే. ఆమె మనసు అతనిమీదే లగ్నమయింది.

"కాని.. యశోధరా... మీ నాన్నగారికి చక్రవర్తి అంటే చాలా కోపం."

ఆమె నవ్వింది. "చూడండి.. మీరు నా అందాన్ని చూస్తూ ఆనందించేరా?"

దొరికిపోయిన దొంగలా తలవంచుకుని- "ఊఁ." అన్నాను ఒప్పేసుకుంటూ.

"ఓ చక్కని అమ్మాయి సమస్యను పరిష్కరించగలిగితే- మీకు గర్వంగానూ, తృప్తిగానూ అనిపించదూ?"

అప్రతిభుడినై- "ఔను. ప్రయత్నిస్తాను... తప్పకుండా..." అంటూ కదిలాను జమీందారు గదివేపు.

జరుగుతున్న చిత్రమయిన నాటకంలో నా పాత్ర ఏమిటో నాకే అర్థం కావడంలేదు. సైకియాట్రీ పుస్తకాలు మళ్లీ తిరగెయ్యాలనుకున్నాను మనసులో.